సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం | 30 | ఏప్రిల్ | 2024



వైఎస్ కుటుంబమంతా జగన్ వెంటే

వైఎస్ కుటుంబమంతా వైఎస్ జగన్ వెంటే ఉందని దివంగత వైఎస్సార్ సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. - 8లో



డ్యూయల్ డిగ్రీ అవకాశం

ఒకే విద్యా సంవత్సరంలో రెండు డిగ్రీలు చదువుకునే అవకాశం విద్యార్థులకు, ఉద్యోగులకు ఉందని వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ పేర్కొన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
44.0/27.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.4 – 44.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

విజయ సంకల్పం

- నేడు మైదుకూరుకు రానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మధ్యాహ్నం 1గంటకు నాలుగురోడ్ల కూడలిలో బహిరంగ సభ
- గత ఎన్నికల్లో సెంటిమెంట్ కొనసాగిస్తూ ఏర్పాట్లు





హెలిప్యాడ్ వద్ద పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

సాక్షి ప్రతినిధి, కడప: సంక్షేమ పథకాలతో పేదల తలరాత మారుస్తూ.. నవరత్నాలతో అర్హుల జీవితాల్లో వెలుగులు నింపి, ఆపన్నులకు అండగా నిలుస్తూ, భవిష్యత్తుకు బాటలు వేస్తూ, నేనున్నానని భరోసా ఇస్తూనే చరిత్ర సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం మైదుకూరుకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం ప్రకాశం జిల్లా టంగుటూరు బహిరంగసభలో పాల్గొననున్న ఆయన అక్కడి నుంచి మైదుకూరుకు హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా–నిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను 99శాతం అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. తన హయాంలో సాయం పొంది ఉంటే, లబ్ధి చేకూరి ఉంటేనే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ప్రకటించిన నాయకుడు దేశ చరిత్రలోనే లేరని ప్రజానీకం కొనియాడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల మేనిఫెస్టో విడుదల చేసి, మరోమారు అవకాశమివ్వాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి తోడ్పాటు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. అందులోభాగంగా మైదుకూరుకు మంగళవారం రానున్నారు.

బస్సు యాత్రకు నీరా'జనం'

సొంత గడ్డపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్చి 27న ప్రారంభించిన బస్సు యాత్ర సక్సెస్ అయింది. ప్రొద్దుటూరులో ప్రజలు నీరాజనం పలికారు. గత గురువారం 25న అభిమాన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో నామినేషన్ దాఖలు సందర్భంగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారు. వారం తిరక్కమునుపే మైదుకూరు ఎన్నికల సభ చేపట్టనున్నారు. అదే అభిమానాన్ని ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున తరలి వచ్చేందుకు ప్రజానీకం సన్నాహాలు చేసుకున్నారు. కడప ముద్దుబిడ్డకు ఘన స్వాగతం పలికేందుకు రాజకీయపార్టీలకతీతంగా జనం సిద్ధమవుతున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

సెంటిమెంట్ కొనసాగిస్తూ...

గత సార్వత్రిక ఎన్నికల్లో సెంటిమెంట్‌ను ఈసారి కూడా కొనసాగిస్తున్నారు. 2019 ఎన్నికల్లో మైదుకూరు నాలుగురోడ్ల కూడలిలో విపక్షనేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది. ఈసారి కూడా అదే సెంటర్‌లో ఎన్నికల ప్రచారసభను ఏర్పాటు చేశారు. తద్వారా గత ఎన్నికల్లో సాధించిన ఫలితాలు ఈ ఎన్నికల్లో కూడా రిపీట్ అవుతాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎస్పీ సిద్ధార్థకౌశల్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ ఒకరు, నలుగురు డీఎస్పీలు, 10మంది సీఐలు, 29మంది ఎస్ఐలు, 550 మంది పోలీసులు సీఎం బందోబస్తులో పాల్గొననున్నారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు...

సీఎం ఎన్నికల బహిరంగసభ నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన నేపథ్యంలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ప్రొద్దుటూరు వైపు నుంచి బద్వేల్‌కు వెళ్లే వాహనాలు ప్రొద్దుటూరు రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర ఎన్‌హెచ్–40 కడప-కర్నూల్ రోడ్డుపైకి వెళ్లి ఖాజీపేట కూడలి నుంచి వెళ్లాలి. పోరుమామిళ్ల నుంచి కడప, ప్రొద్దుటూరు, నంద్యాల వైపు వెళ్లే వాహనాలు వనిపెంట వద్ద కుడివైపు డైవర్షన్ తీసుకొని ఉత్సలవరం మీదుగా నంద్యాల రోడ్డులోని తిరుమల దాబా వద్దకు వచ్చి, ఎన్‌హెచ్–40 రోడ్డులో వెళ్లాలి. లేదా కేశలింగాయపల్లె గ్రామం దగ్గర ఎడమ వైపు డైవర్షన్ తీసుకొని శెట్టివారిపల్లె మీదుగా పుల్లయ్యసత్రం మీదుగా కొత్త బైపాస్ రోడ్డు మీదుగా కడప రోడ్డుకు చేరుకునేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

భద్రతా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేసిన ఎస్పీ

మైదుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం మైదుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం మైదుకూరులో ముఖ్యమంత్రి బహిరంగ సభకు సంబంధించిన సభా స్థలిని ఎస్పీ పరిశీలించారు. పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కోర్టు భవనాలు సమీపంలోని హెలిప్యాడ్ వద్ద ఎస్పీ, పోలీసు అధికారులు సిబ్బందితో కాన్వాయి రిహార్సల్ నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం

మైదుకూరులో మంగళవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మదీనా మసీదు మూడో వీధి వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభా స్థలికి చేరుకోనున్నారు.

సీఎం పర్యటన ఇలా...

ఉదయం 9.40గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 10.45 గంటలకు ప్రకాశం జిల్లా టంగుటూరు చేరుకొని, 11గంటలకు బహిరంగ సభలో పాల్గొననున్నారు. 12.10 గంటలకు టంగుటూరు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 12.45 గంటలకు మైదుకూరుకు హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. 12.55 గంటలకు సభాస్థలికి చేరుకుని 1.10 నుంచి 1.55 గంటల వరకు కొనసాగించనున్నారు. 2.10 గంటలకు మైదుకూరు నుంచి అన్నమయ్య జిల్లా కలికిరికి వెళ్లనున్నారు. 3.20 నుంచి 4.05 గంటల వరకు కలికిరిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

చంద్రబాబు-కిరణ్ ఇద్దరూ వెన్నుపోటుదారులే

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ములకలచెరువు సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బి.కొత్తకోట: పదవి కోసం మామకు చంద్రబాబు, రాష్ట్ర విభజనకు కారకుడైన కిరణ్ ఇద్దరు వెన్నుపోటు దారులేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ములకలచెరువులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల సభ జరిగింది. ఈ సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పదవీ కాంక్షతో కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర విభజనకు సహకరిస్తారని ఢిల్లీ పెద్దలకు నమ్మబలికారన్నారు. పదవి నుంచి దిగిపోయి రాజీనామా చేశారన్నారు. పదవి దిగిపోయాక ఇక్కడికి ఏనాడైనా వచ్చాడా, అభివృద్ధి చేశాడా, ఏమీ చేయని కిరణ్ ఎంపీగా పోటీ చేస్తే ఆదరిస్తారా అని ప్రజలను ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని లేకుండా చేసిన కిరణ్ వైఎస్ కుటుంబానికి అన్యాయం చేశారని చెప్పారు. 2014లో మేనిఫెస్టో పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే 2019లో తిరస్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే మోసాలతో ప్రజలను నమ్మించేందుకు వస్తున్నారని, ఇప్పటికి చంద్రబాబుకు బుద్ధి రాలేదని అన్నారు. జగన్ గత ఎన్నికల్లో చెప్పినవి చేశాక ఇప్పుడు ఎన్నికలకు వెళ్తున్నారని తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ చెప్పేమాటలు నమ్మవద్దని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. ఉమ్మడి చిత్తూరు పశ్చిమ మండలాల్లో కరువును గుర్తించిన ప్రభుత్వం మూడు రిజర్వాయర్లను మంజూరు చేసిందన్నారు. ఒకటి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముదివేడులో నిర్మాణం చేపడితే చంద్రబాబు చొరవతో కోర్టు ద్వారా పనులు నిలిపి వేయించారన్నారు.

న్యూస్‌రీల్

ఫీజు చెల్లింపునకు ఒక్కరోజే గడువు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 30వ తేదీ ఒక్క రోజు మాత్రమే గడువుందని ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. ఫీజు చెల్లించని విద్యార్థులెవరైనా ఉంటే వెంటనే ఫీజు చెల్లించాలన్నారు.

10, 11 తేదీల్లో వివాహ వ్యవస్థపై అవగాహన

కడప కల్చరల్: కడప మేత్రాసనం ఆదేశాల మేరకు నగర శివారులోని రామాంజనేయపురంలో గల పాస్టరల్ సెంటర్‌లో మే 10, 11 తేదీల్లో వివాహ వ్యవస్థపై యువతీ యువకులకు అవగాహన కల్పించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ ఫాదర్ వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండురోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. డాక్టర్, లాయర్, పోలీసు అధికారి, గురువులు, కన్య స్త్రీలు కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

673 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 675 ఫిర్యాదులు అందగా.. 673 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేశామన్నారు.

- సి-విజిల్ ద్వారా మొత్తం 421 కేసులు నమోదు కాగా అందులో 258 నిజనిర్ధారణ కాగా, 163 నిరాధారమైనవిగా గుర్తించామన్నారు.
- ఎఫ్ఎస్‌టీ,ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,91,37,735 ల మేర నగదు, రూ.7,68,05,363 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశారు. అలాగే 1,172 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేత వీరభద్రుడు



పల్లకీ సేవలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి శ్రీ వీరభద్రస్వామి వారికి, భద్రకాళీ అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

ఏపీజీబీ చైర్మన్‌గా సత్యప్రకాశ్‌సింగ్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సత్యప్రకాశ్‌సింగ్ సోమవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాకేష్ కశ్యప్ బెంగళూరుకు బదిలీపై వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న సత్యప్రకాశ్‌సింగ్ ఇక్కడికి వచ్చారు. అనంతరం బ్యాంకు అధికారులతో నూతన చైర్మన్ మాట్లాడుతూ ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఇతర వాణిజ్య బ్యాంకులతో సమానంగా డిజిటలైజేషన్ ప్రక్రియలో ముందుకు కొనసాగుతోందని వివరించారు. అంతేకాకుండా బ్యాంకు సర్వతోముఖాభివృద్ధికి అధికారులు, సిబ్బంది నిజాయితీగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ విజయభాస్కర్, ఆర్.గిరి, టీఆర్ పడగెట్వార్, సంజీవప్ప, రాజేంద్రన్, హర్కేశ్వరప్రసాద్, రంజిత్ కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం



పోరుమామిళ్ల రోడ్ షోలో ఫ్యాన్ బొమ్మ చూపిస్తున్న అవినాష్‌రెడ్డి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎన్. విశ్వనాథరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన రోడ్‌షోలో ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ పాల్గొన్నారు. జనం భారీగా కదిలి వచ్చారు. ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కూటమి మేనిఫెస్టో ఎన్నికల తరువాత కనిపించదన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పినవి ఏవీ ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో బద్వేలు నియోజకవర్గంలో ఖర్చు చేసిన నిధులు, అభివృద్ధిని వివరించారు. జనానికి అభివాదం చేస్తూ, ఫ్యాన్ బొమ్మ చూపిస్తూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అవినాష్‌రెడ్డి కోరారు. యువనేత ఆదిత్యారెడ్డి, రైతు నాయకుడు సంబటూరు ప్రసాదరెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, మూడు మండలాల పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

వైవీయూ బీటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఆచార్య ఎస్.సి. గంగిరెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాసరావుతో కలిసి వీసీ సోమవారం వైవీయూలో ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్ ఫస్ట్ ఇయర్ ప్రథమ సెమిస్టర్ పరీక్షల్లో 46.43 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సెకండియర్ ప్రథమ సెమిస్టర్‌లో 53.47 శాతం మంది పాసయ్యారన్నారు. సెకండియర్ ఫస్ట్ సెమిస్టర్ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం విధానంలోని సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, మెటలర్జీ మెటీరియల్ సైన్స్ టెక్నాలజీలో 60.74 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పీజీకి సంబంధించి ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల్లో 74.51 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు.

ఆత్మీయ పలకరింపు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి రెడ్డి సోమవారం వేంపల్లెలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.
-వేంపల్లె

-వివరాలు 8వ పేజీలో ▶

ఎన్నికల బరిలో మిగిలింది వీరే!

- కడప లోక్‌సభ స్థానంలో 14 మంది అభ్యర్థులు
- ఏడు శాసనసభ స్థానాల్లో 110 మంది
- 'మను' పాలిటెక్నిక్‌లో స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రాలు
- 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగింపు
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక కడప లోక్‌సభ బరిలో 14 మంది, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 110 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 27 మంది పోటీలో ఉన్నారని చెప్పారు. ఆ నియోజకవర్గంలో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కడప లోక్‌సభ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు కార్యక్రమం కూడా పూర్తి చేశామన్నారు. ప్రధాన పార్టీలతోపాటు రిజిష్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళి మేరకు అనుమతులు పొంది ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికల ఖర్చు ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులుగా కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె, వ్యయ పరిశీలకులుగా రమేష్‌భారతి, సత్యేంద్రసింగ్ మెహర, రాజీవ్ కుమార్ మీనా ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసెజీలు, వీడియో డిజిటల్ వ్యాన్‌లలో, సినిమా హాళ్లలో ప్రదర్శించే ప్రకటనల కంటెంట్‌లకు ఎంసీఎంసీ కమిటీ ద్వారా ప్రీ సర్టిఫికేషన్ తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు మొదటి విడత శిక్షణ పూర్తయిందని, రెండవ విడత శిక్షణ ఆయా నియోజకవర్గాల పరిధిలో రిటర్నింగ్ అధికారులు నిర్వహిస్తారన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 878 మందికి 78 బృందాల ద్వారా మే 6వ తేదీ ఓటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెంది ఇతర జిల్లాలలో ఓటరుగా ఉండి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కడప మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో మే 5వ తేదీ పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాకు చెంది పోలింగ్ విధులు నిర్వర్తించే వారికి కూడా మే 5వ తేదీ ఆయా నియోజకవర్గాలలో పోలింగ్ జరుగుతుందన్నారు. అత్యవసర సర్వీసులలో పనిచేస్తూ పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మే 7వ తేదీ ఆయా నియోజకవర్గాలలో పోలింగ్ నిర్వహిస్తామని వివరించారు. మే 1వ తేదీ ఈవీఎంల ర్యాండమైజేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కడప నగరంలోని మౌలాన అబుల్ కలాం ఆజాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ (మను)లో స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మే 11వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ముగించాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య
కడప (లోక్‌సభ)	14
బద్వేలు	14
కడప	13
పులివెందుల	27
కమలాపురం	11
జమ్మలమడుగు	15
ప్రొద్దుటూరు	15
మైదుకూరు	15

ఎంసీసీ నిబంధనలు పాటించాలి

కడప సెవెన్‌రోడ్: కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు తప్పక పాటించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ, పార్టీ గుర్తుల కేటాయింపు అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, ఎన్నికల జిల్లా కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బరిలో నిలిచిన అభ్యర్థులతో జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను తప్పక పాటించాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను క్షుణ్ణంగా వివరించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు మాట్లాడుతూ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో చిన్నపిల్లలను వినియోగిస్తే ఎన్నికల నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటింగ్ సమయంలో రాజకీయ పార్టీల తరపున పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలను చెడగొట్టే చర్యలకు పాల్పడితే చట్టపరమైన శిక్షకు గురవుతారన్నారు.

క్లుప్తంగా

గజ వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు
– నేడు రథోత్సవం



గజవాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామ లింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం గజ వాహనంపై ముక్తిరామలింగేశ్వరున్ని ఊరేగించారు. వేకువజామున సైకతలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను రాత్రి గజవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. మంగళవారం ఉదయం ముక్తిరామ లింగేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి కోరారు.

అరటి తోట దగ్ధం

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ భాకరాపేటకు చెందిన రైతు, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నాగం మల్లికార్జునరెడ్డికి చెందిన అరటి తోట అగ్నికి ఆహుతి అయింది. సోమవారం బాధిత రైతు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి పంచాయతీ పేరయ్యగానిపల్లె గ్రామ సమీపాన ఉన్న 7ఎకరాల భూమిలో రూ. 14లక్షలు ఖర్చు చేసి అరటి పంటను సాగు చేశానన్నారు. ఆదివారం మధ్యాహ్నం తాను ఇంటి వద్ద ఉండగా... అరటి తోట కాలుతోందని సమాచారం రావడంతో హుటా హుటిన పొలం వద్దకు వెళ్లానన్నారు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. వీలు కాక పోవడంతో కడప అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కడప నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే పంట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన చెందాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. వీఆర్‌ఓ నాని అరటి తోట పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చెన్నూరు : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప–రాజంపేట బైపాస్ పాలంపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన జింకా సుబ్బరాయుడు (75), ద్వీపం సుబ్బన్న (65)లు వ్యక్తిగత పనుల మీద రామనపల్లి నుండి కడపకు టీవీఎస్ మీద వెళుతుండగా దేవుని కడప నుండి బైపాస్ మీదుగా అలంఖాన్‌పల్లెకు వెళుతున్న సెప్టిక్ ట్యాంక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో జింకా సుబ్బరాయుడు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన సుబ్బన్నను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

అభివాదం చేస్తూ.. అనురాగం చూపిస్తూ..

వేంపల్లె : వేంపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సతీమణి వైఎస్ సమతారెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి సతీమణి సుమతిరెడ్డిలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరికి మహిళలు హారతులు పట్టి బ్యాండు వాయిద్యాలతో స్వాగతం పలికారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు వైఎస్ భారతిరెడ్డి, వైఎస్ సమతారెడ్డిలకు దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు.

స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి, గాంధీరోడ్డు, అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పాతపేట, కాపువీధి, జీఎం కాంప్లెక్స్, కాలేజీరోడ్డు, రాఘవేంద్ర స్కూల్ ఏరియా, బిడాలమిట్ట వీధులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఐదేళ్ల కాలంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుత మేనిఫెస్టోలో పొందుపరచిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జోరుగా ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటా ప్రచారంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్‌సీపీకే ఓటు వేస్తామని చెప్పడంతో వారు చిరునవ్వుతో ముందుకుసాగారు. వికలాంగులు, వృద్ధులు, దుకాణదారులు, చేతివృత్తులు చేసుకునేవారు, అనారోగ్యంతో మంచంలో ఉన్న వారిని కూడా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండండి.. మళ్లీ మన జగనన్న ప్రభుత్వమే వస్తుందని వారికి భరోసా కల్పిస్తూ ప్రచారాన్ని ముందుకు సాగించారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మళ్లీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి కుమారులు తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, హజ్‌హౌస్ రాష్ట్ర డైరెక్టర్ మునీర్ బాషా, మైనింగ్ అండ్ మినరల్స్ రాష్ట్ర డైరెక్టర్ సల్మా, మాజీ జడ్పీటీసీ సభ్యులు షబ్బీర్‌వలి, డా.ఎస్ఎఫ్ బాషా, యూత్ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేంపల్లెలో సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి విస్తృత ప్రచారం



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి



వ్యాపారస్తులకు అభివాదం చేస్తున్న వైఎస్ భారతిరెడ్డి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ భారతిరెడ్డి



మాజీ సర్పంచ్ రామలింగయ్యతో మాట్లాడుతున్న వైఎస్ భారతిరెడ్డి



సంక్షేమ కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ సమతారెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



నల్లపురెడ్డిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందుల : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అన్నారు. ఎలాంటి భయాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరు వచ్చే నెల 13న జరిగే పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆయన సమస్యాత్మకంగా ఉన్న బూత్‌ల గురించి తెలుసుకుని అక్కడ పర్యటించి పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు మద్దిలేటి, శంకర్‌రెడ్డి, ఎస్సై అరుణ్‌రెడ్డిలతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం స్మగ్లర్‌తో అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల అటవీ ప్రాంతంలో 101 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోమవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు మల్లెపల్లి సెక్షన్ ఇటుకుళ్లపాడు అడవిలో చందనాలబోడు నుంచి కూంబింగ్ నిర్వహించగా ఎర్రబావిచెరువు వద్ద రవాణాకు సిద్ధం చేసిన ఎర్రచందనం దుంగలు, మినీ లారీ కనుగొన్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని గమనించిన స్మగ్లర్స్ పారిపోగా ఒకరిని పట్టుకొన్నారన్నారు. ముదిరెడ్డిపల్లెకు చెందిన కొమరోలు అంకయ్యగా గుర్తించామన్నారు. దుంగలతో పాటు టాటా గూడ్స్ క్యారియర్, రెండు మోటార్ బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుంగలు 2959 కేజీల బరువున్నాయని, వీటి విలువ కోటి రూపాయలు ఉంటుందన్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కూంబింగ్‌లో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ చిరంజీవి, ఆర్ ఎస్ఐలు మురళీధర్‌రెడ్డి, నరేష్ బృందం పాల్గొందన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి రివార్డులు ఇచ్చారు.

డ్యూయల్ డిగ్రీ అవకాశాన్ని వినియోగించుకోండి

వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ఒకే విద్యా సంవత్సరంలో రెండు డిగ్రీలు చదువుకునే అద్భుత అవకాశం నేటి విద్యార్థులకు, ఉద్యోగులకు, అన్ని వర్గాలకు ఉందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం వైవీయూలోని సెనేట్‌హాల్లో దూర విద్యా సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రెగ్యులర్, ఆన్‌లైన్, దూరవిద్య కోర్సులు సమానమేనన్నారు. ప్రభుత్వం కూడా వీటికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రెగ్యులర్ కోర్సుల తీరులోనే మిగిలిన వాటికి సెమిస్టర్ విధానం అమలవుతుందన్నారు. జాతీయ విద్యావిధానం– 2020 ప్రకారం విద్యార్థి కేంద్రీకృతంగా విద్య వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీ, పీజీ రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కోర్సులను ఒకే అకడమిక్ ఇయర్‌లో చదువుకోవచ్చు అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో రెండింటికీ సమాన విలువ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. వైవీయూలో లభించే దూర విద్య కోర్సులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. దూరవిద్య సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూలో అందుబాటులో ఉన్న 8 కోర్సుల గురించి వివరించారు. ఫిజికల్ మోడ్, ఓడీఎల్ విధానం, ఆన్‌లైన్ స్టడీ గురించి వివరించారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామ ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



పార్టీలో చేరిన వారితో ఇసి దినేష్‌రెడ్డి, తుషార్ నాగిరెడ్డి, నాగెళ్ల సాంబశివారెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

వేముల : మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో బాలగంగిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బాలచంద్రారెడ్డిలతో పాటు మరో 20 కుటుంబాల వారు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వీరికి ప్రముఖ వైద్యులు డా.ఇసి దినేష్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి కుమారుడు తుషార్ నాగిరెడ్డిలు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీ సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామమునిరెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, నాయకులు వెంకటనారాయణ, రాజారెడ్డి, వెంకటశివారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలమల్లలో..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామంలోని పలు వడ్డెర కులస్తుల కుటుంబాలు సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలోకి చేరినవారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆరవ మహేశ్వరరెడ్డి, కొప్పర్తి ఓబుళరెడ్డి, ఆరవ లక్ష్మీనారాయణమ్మ, వెన్నపూస నారాయణమ్మలతో పాటు ఇతర కుటుంబాలు ఉన్నాయి.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్
– సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ఆపన్న హస్తం అందిస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ తెలిపారు. కడప నగరం రిమ్స్ ఆవరణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్(సఖి)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సెంటర్ ద్వారా ఒకే చోట అనేక సేవలు అందుతున్నాయన్నారు. ఆయన కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించారు. అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం ,తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ,యాసిడ్‌దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు వంటి సందర్భాలలో మహిళలు ఈ కేంద్రాన్ని ఆశ్రయించవచ్చన్నారు. అనంతరం జడ్జి ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100 మొదలగు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



సుస్మిత(ఫైల్)

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లి నివాసి బుసర శేఖర్ కుమార్తె సుస్మిత(17) అదృశ్యమైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పీసీసీ చీఫ్‌గా షర్మిల అనర్హురాలు



మీడియాతో మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

కడప కార్పొరేషన్ : పీసీసీ అధ్యక్ష పదవికి షర్మిల అనర్హురాలని, రాష్ట్ర ఉపాధ్యక్షుడి హోదాలో ఉన్న తానే ఆమెతో నేరుగా మాట్లాడలేకపోయానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నజీర్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. గుర్రాలగడ్డలోని తన నివాసంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. షర్మిల తీరుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా నిరుత్సాహంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆమెను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని నమ్మి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ దస్తగిరి, 31వ డివిజన్ కార్పొరేటర్ అజ్మతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు డా. సొహైల్, కమాల్‌బాషా, రిజ్వాన్, షఫీ, ఇస్మాయిల్, అన్సర్, ఫరూక్ పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబమంతా జగన్ వెంటే

వైఎస్సార్ సోదరుడు వైఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబమంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉందని దివంగత వైఎస్సార్ సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి ఐఎంఏ హాలులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు, న్యాయవాదులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తాము వైజాగ్‌లో ఉంటామని, ఎప్పుడైనా ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తుంటామన్నారు. ఇటీవల తాను పాడేరులో ఒక పాఠశాలను చూశానని, హైదరాబాద్‌లో కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో మౌలిక వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే తనకు ఓటేయమని అడిగిన సీఎం దేశంలో ఎవరూ లేరని ప్రశంసించారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్ కుటుంబీకులు, సజ్జల భార్గవ్‌రెడ్డి తదితరులు



సమావేశంలో పాల్గొన్న వైద్యులు, మేధావులు

• వైఎస్ విమలమ్మ కుమార్తె వైఎస్ దివ్యారెడ్డి మాట్లాడుతూ జగనన్న నవరత్నాలతో ఇచ్చిన భరోసాతో పేద ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా జీవిస్తున్నారన్నారు. జగనన్న సీఎం అయ్యాక రెండేళ్లు కోవిడ్‌కే పోయిందని, ఈ మూడేళ్లలో ఎన్నికల్లో చెప్పినవన్నీ చేశారన్నారు. ఇంకో ఐదేళ్లు అవకాశమిస్తే ఇంకెంత చేస్తాడో ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడప రూపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. విద్యారంగంపై జగనన్నకు ప్రత్యేక విజన్ ఉందని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా అంజద్‌బాషాను గెలిపించాలని కోరారు.

• వైఎస్ సుమధుర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ కుటుంబంలో జగన్ ఒంటరి అయ్యాడనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కుటుంబమంతా ఆయనతో ఉందని చెప్పారు. తన సంక్షేమ పథకాలతో జగనన్న పేదల జీవితాలను మార్చేశాడని తెలిపారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చి వైఎస్ఆర్ కంటే రెండు అడుగులు ముందుకేసి ప్రజలకు మేలు చేస్తున్నారని తెలిపారు.

• జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. తెలుగుదేశం పార్టీ చెబుతున్న మేనిఫెస్టోను అమలు చేయాలంటే సాధ్యం కాదన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను ఆలోచించి ఓటేయాలని కోరారు.

• యూఎస్ఏ ప్రతినిధి పండుగాయల రత్నాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలు యూఎన్‌ఓకు వెళ్లడం సామాన్యమైన విషయం కాదన్నారు. అనంతరం సజ్జల భార్గవ్ రెడ్డి వైద్యులు, న్యాయవాదులు, మేధావుల సలహాలు, సూచనలు స్వీకరించారు.

• ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చైతన్యరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జయసోమేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుబాల విజయ్ కుమార్, సీహెచ్ వినోద్ కుమార్, సమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.